ఆమె టీనేజ్‌లో వుందో లేక ఇరవైలో వుందో, మొదటి చూపులో నేను ఖచ్చితంగా నిర్ణయించుకోలేకపోయాను. ఆమె సందెచీకట్లో బొమ్మలా నిలబడి వుంది. చీకటితో కప్పబడినట్లు, పొగుచేసిన చీకటిలావుంది.

ఆమె అత్యంత ఖరీదైన చీర, ఎంబ్రాయిడరీ బ్లౌజుతో పూర్తియవ్వనంలో నల్లగా వుందా? లేక సర్వం దోచుకోబడిన తన శారీరక ఒంపులను ప్రదర్శిస్తోందా? లేక ఆమె మంచి రంగులో, పింక్‌కలర్ శాటిన్ సాల్వార్, జంపర్, తెల్లని జార్జెట్‌పై వస్త్రం ధరించి వుండవచ్చు. మంచులా తెల్లగా వుండవచ్చు. మరిలేకుంటే, ఉద్రేకాన్నీ, కోరికలను ప్రేరేపించే నున్నని పిక్కలు కనిపించేట్లు రంగుల ఫ్రాక్, స్కర్టు ధరించి వుండవచ్చు.


ఆమె కళ్ళలో అశాంతి వుంది. ఆమె కళ్ళు నలుపు రంగులోనో, గోధుమ వర్ణంలోనో, నీలిరంగులోనో వుండవచ్చు. ఆమె కళ్ళు ఎన్నో ప్రశ్నలతో కలత చెందివున్నాయి. కానీ ఆ భాష ఏమిటి? ఆ కళ్ళు ఏమైనా చెబుతున్నాయా? నాకారహస్యం అర్థం కాలేదు. లేక నేను అమాయకంగానో, గమనించనట్లో నటిస్తున్నానా? ఆశ్చర్యంగా లేదూ? నేను చాలాసార్లు బొత్తిగా ఏమీతెలీక పోయినా సర్వజ్ఞునివలె గొప్పలు చెబుతూవుంటాను. ఆధునిక మానవునిలో ఈ ద్వంద్వవైఖరి ఒక ప్రధానభాగమైంది.

తెలుగు అనువాదం :
కొమ్మిశెట్టి మోహన్

# స్వగతం

(ఉర్దూ కథానిక)

-ఎమ్.క్యు.ఖాన్



ఎక్కడ, ఎలా, నేనామెకు తారసపడ్డాను? నా అంతరంగాల్లో కుక్కగొడుగులా ఒక సందేహం వేలాడుతోంది.

నేనామెను ఎప్పుడు, ఎక్కడమాత్రం చూడలేదు? నేనీరహస్యం ఇప్పుడే బయటపెడితే కథ తడబడుతూ, కుంటుతూ మొదలౌతుంది. చివరి వరకూ చదవడానికెవరూ ఇష్టపడరు.

కాబట్టి నేనే బయటపెట్టకూడదు. ప్రజలే వూహించుకోనీ! సస్పెన్స్‌లోనూ, సందేహంలోనూ మునిగితేలనీ! అదేకథ చెప్పడంలో వుండవలసిన కళ.

నేనామెను రైల్వేబ్రిడ్జి కింద చూశానన్న రహస్యం బయటపెట్టాననుకోండి! మరుక్షణమే నేనామెను ప్రేక్షకులతోను, శ్రోతలతోను నిండిన ఒక పెద్దహాలులో చూసినట్టు గుర్తుకొస్తుంది. కానీ ఎక్కడో మారుమూల జ్ఞాపకాల్లో ఒకరూపం నన్ను లాగుతోంది.

'నీకు జ్ఞాపకశక్తి తక్కువ. నువ్వు నన్ను కోర్టులో...వైపురోడ్డులో...క్రాసురోడ్డులో...మలుపుతిరిగేచోట...చిన్నసందుల్లో...చూశావు...' ఇలాంటి ఎన్నో దృశ్యాలు ఒకదానివెంట మరొకటి!

నేను మరొకసారి దిగ్భ్రమ చెందాను.

ఇది నిజం! నేనామెను మార్కెట్లో చూశాను; బాల్కనీలో చూశాను; చీకటిసందులో చూశాను; దుర్గంధంతో పొంగిపొరలే మురికి కాలవప్రక్కన చెమ్మగానున్న వూపిరాడని గదిలో...

కానీ ఒకప్రశ్న నన్ను వేధిస్తోంది. ఆమేనా? ఆమెవలె మరొకరైనావుండవచ్చు.

వయసు మళ్ళిన స్త్రీ-పురుషులు, బాలబాలికలు, కుంటిపిల్లలు, బలంగా ఆరోగ్యంగా వున్నపిల్లలు, ఇలా చాలామంది రైల్వే బ్రిడ్జిక్రింద నివసిస్తుంటారు. దాదర్ బ్రిడ్జి, మహాలక్ష్మి బ్రిడ్జిల క్రింద నివసించే పిల్లల్ని గురించి మీరు వినలేదా?

'నువ్వు అక్కడెందుకున్నావు?' అని నువ్వు నన్ను నిందించవచ్చు. కేకలేయవచ్చు.

నువ్వు నాపట్ల ఎలాంటి అభిప్రాయమేర్పరచుకున్నా నన్నేమీ చేయలేవు.

భుజాలమీద కూర్చుని ప్రతిఒక్కరి కదలికలను గమనించే స్వయం నియమిత దేవదూతవు నువ్వు. నేనా చోటికి వెళ్ళలేదని ఒట్టుపెట్టుకుని నిన్ను నమ్మించడానికెంత గట్టిగా ప్రయత్నించినా, నిన్ను ఆ అనుమానపు బురద నుంచి బయటకు లాగడం కష్టం.

ఒకవేళ నేనక్కడికి వెళ్ళివుండినా బ్రిడ్జిచివరిగా ఎక్కడో వుండివుంటాను.

అక్కడినుండి సగం వెలుతురులో కనిపించీ కనిపించని దృశ్యాన్ని చూసివుంటాను. అయినా నేనామెను చూశానని ఒప్పుకుంటాను. ఆమె నెలా చూడకుండా వుండగలను?

నేనామెను బాల్కనీలోనో, తెరవెనుకనో, బలంగా అదుముకున్న చేతుల్లోనో, ఘల్లుఘల్లుమనే గజ్జలతోనో, ఆడుతూ పాడుతూనో, తన ఆడతనపు అందాలను ప్రదర్శిస్తూనో చూసివుండవచ్చు.

ఒకవేళ నేనామెను పైన పేర్కొన్న ప్రదేశాల్లోనో, పరిస్థితుల్లోనో, చూడకుండా వుంటే, గుడిలోపలో, గుడిద్వారం దగ్గరో, అనాథశరణాలయ ఆర్గనైజరుతోపాటో, వితంతు సదనంలోనో, హోటళ్ళ వద్ద తచ్చాడుతూనో, తొంగిచస్తూనో, పార్కింగ్ షెడ్లవద్దో బహుశ చూసివుంటాను. అలాకాకుంటే ఒకరుషి, సన్యాసి, ఫకీరు లేక భిక్షుకుని కుటీరంలోనో, దర్గాలోనో, చర్చిలోనో, మఠంలోనో, సన్యాసుల ఆశ్రమంలోనో, ప్రభుత్వ అతిథిగృహంలోనో, మంత్రిగారి నివాసంలోనో, భూస్వామి హవేలీలోనో, లేక ప్రభుత్వాధికారి బంగళాలోనో ఆమె వుండివుండవచ్చు. నేనామెను ఇలా ఎన్నోచోట్ల చూసినపుడు ఫలానా చోటని ఎలా చెప్పగలను? నేనామెని ఎక్కడ, ఎలాంటి స్థితిలో చూశానని చెప్పడం ఎంతో ప్రయాసతో కూడుకున్నపని. ఆమెను నేనెక్కడ చూడలేదు? ఎప్పుడు చూడలేదు? ఎలాంటి దుస్తుల్లో, ఎలాంటి ఫ్యాషన్లలో చూడలేదు?

ఆమె నాజ్ఞాపకాల తలుపుల నెందుకు మాటిమాటికి తడుతోంది?

నాకేమీ సంబంధంలేదు. నేనేమీ పట్టించుకోను. నన్ను నేను ఓదార్చుకునే ప్రయత్నం చేస్తాను. ఆమె తలుపు తట్టడం నిజమేనా....బహుశ ఆమె సందులో ఇంకెవరి తలుపో తడుతూ వుండవచ్చు. ఆమె ఒంటరిగానే తలుపు తడుతుందా? తలుపు దానంతటదే సగం తెరచుకుని ఆమెకు ఇష్టం వున్నా లేకున్నా లోపలికి తీసుకుపోతుందా?


ఈ తలుపు ఆమెనెంత దూరం తీసుకుపోతోంది? దీని తర్వాత, ఇంకా ఎన్నో తలుపులు తెరచుకుంటాయి. ఆమెను మళ్ళీ తిరిగిరాలేని ప్రపంచంలోకి తీసుకువెళతాయి. ఈ తలుపులు ఆమెను లోపలకు తీసుకువెళ్ళడమేకాదు, ఆమెను వీధుల్లోకి, సందుల్లోకి, పొంగిపొరలే మురికి కాలువలతో దుర్గంధపూరితమైన సందుల్లోకి తోసేస్తాయికూడా!

సగం తెరచుకుని, లోనికి ఆహ్వానించిన తలుపులే తర్వాత ఆమెకోసం మూసివేయబడతాయి. కానీ ఈ తలుపులు మొదట ఆమెకోసం ఎందుకుతెరచుకున్నాయి? తర్వాతెందుకు లోనికిరానివ్వక మూసుకున్నాయి?

బహుశ ఏకాంతంలో మనం ఆమెకోసం తలుపులు తెరిచివుంచి, బహిరంగంగా తలుపులు మూసేస్తాము కాబోలు!

అలాకాకుంటే, ఆమె తలుపులుతట్టి పెంపుడుకుక్కలా ఎవర్నో ఎందుకలా అనుసరించాలి? తర్వాత కుష్టురోగిని తన్నితరిమేసినట్లామెను ఎందుకలా గెంటెయ్యాలి?

ఆమెనా అంతరాత్మ తలుపులను మళ్ళీమళ్ళీ తట్టినట్లు నేనింతకు ముందే అంగీకరించాను. నేనా తలుపుచప్పుళ్ళతో డిస్టర్బ్ కాకూడదనే, అనుభవం, వివేకం కలిసిన మాస్టర్‌తాళంతో నా తలుపులు మూసేశాను. 'ఆమె తలుపు తడుతుందని నేను భయపడటంలేదు.



ఆమె కళ్ళల్లో అశాంతి వుంది. ఆమె కళ్ళు నలుపు రంగులోనో, గోధుమ వర్ణంలోనో, నీలిరంగులోనో వుండవచ్చు. ఆమె కళ్ళు ఎన్నో ప్రశ్నలతో కలతచెందివున్నాయి. కానీ ఆ భాష ఏమిటి? ఆ కళ్ళు ఏమైనా చెబుతున్నాయా? నాకారహస్యం అర్థం కాలేదు. లేక నేను అమాయకంగానో, గమనించనట్లో నటిస్తున్నానా? ఆశ్చర్యంగా లేదూ? నేను చాలాసార్లు బొత్తిగా ఏమీ తెలీకపోయినా సర్వజ్ఞునివలె గొప్పలు చెబుతూవుంటాను. ఆధునిక మానవునిలో ఈ ద్వంద్వవైఖరి ఒక ప్రధానభాగమైంది.

కానీ నాలోని తప్పులను అదేపనిగా పరీక్షించే మనుషులంటే భయపడతాను. వారి శ్రవణేంద్రియాలు చురుకుగా పని చేస్తుంటాయి. నిందలు మోపడానికి వారి నాలుకలెప్పుడూ వేగంగా కదులుతుంటాయి.

నేను సిద్ధార్థున్నయి వుంటే ఆమె ఆహ్వానాన్ని అంగీకరించి వుండేవాన్ని. ఆమె ఇచ్చిన పాయసం తాగేవాడిని. ఆమెను ఈ ఆధునిక యుగపు ఆమ్రపాలిని చేసేవాడిని. నేను ఇంద్రున్నయి వుంటే ఆమెను మేనకనో, తిలోత్తమనో లేక ఊర్వశినో చేసేవాడిని.

శాశ్వతంగా నిలిచిపోయే పాత్రలను సృష్టించే అద్భుత శక్తి నాలో వుంటే నేనామెను మరో ఆనందిగానో, సేగంధిగానో, మున్నీబాయిగానో, లేక వుమ్రావ్ జాన్ ఆదాగానో చిత్రించి వుండేవాడిని. ఆమెకు పేరు, ప్రఖ్యాతులు కలిగించేవాడిని.

నేనావరుసలో ఎక్కడాలేను. నాదారి మరెక్కడోవుంది. నేను నీకు ఎదురుపడడం కేవలం కాకతాళీయం...ఎక్కడో క్రాసురోడ్డువద్ద, ఒక సందులో, ఒక వీధిలో, ఒక రైల్వేబ్రిడ్జివద్ద, లేక ఒక రైల్వే ట్రాక్‌మీద! కేవలం అకస్మాత్తుగా, కాకతాళీయంగా కలుసుకోవడం, ఒక అద్భుతరచనా సృష్టికి ప్రేరణకాలేదు.

కాదంటే నేను నిన్నొకసారి చూసినందుకు నన్ను నిందించవచ్చు. నేను ఒప్పుకుంటాను. నువ్వు నన్నొక లతలా అల్లుకుపోయావు. మెల్లమెల్లగా నన్ను నువ్వు మంత్రించినట్లు, నాకు తెలియకుండానే నా వేళ్ళకు పనికల్పించావు. నిన్ను గురించి నాకేం తెలుసు? నువ్వు నన్నెందుకు బలవంతం చేస్తావు? అదొక రసహ్యం. నువ్వునాకు బాగా సన్నిహితంగా పరిచయమైవుంటే, నీతో నా పరిచయాన్ని తిరస్కరించి వుండేవాడిని. నీతో బాగా పరిచయమున్నవాళ్ళలో చాలామంది ఆ పరిచయాన్ని నిర్మొహమాటంగా తిరస్కరించారు. చాలకొద్దిమందే నీతో వారికున్న పరిచయాన్ని బహిరంగంగా అంగీకరించారు.

ఇక్కడి నుంచి వెళ్ళిపో! ఇదొక పెద్దమనుషుల సమాజం. నీటి రక్షకుల సమాజం. దైవభక్తి, గంభీరతగల వాళ్ళ సమాజం.

'నేనెక్కడికి వెళ్ళేది?' నువ్వొక ప్రశ్నవేశావు.

కాబట్టి, నువ్వెక్కడికి వెళ్ళాలో నేను చెప్పాలా?

సరే, నువ్వు చర్చికి వెళ్ళు. ఒక గుడికో, మసీదులో, మఠానికో, లేక సన్యాసాశ్రమానికోవెళ్ళు. ఈ ప్రదేశాలకు వెళ్ళగలగడం నీకు ఇష్టం లేదా? ఒక క్లబ్బుకెళ్ళు. ఒక హోటలుకో, కాఫీక్లబ్బుకో, మ్యూజిక్ ట్రూపుతోనో, డాన్స్ ట్రూపుతోనో వెళ్ళు. అది సాధ్యపడకపోతే రోడ్లవెంటతిరుగు. వీధుల్లోనో, ఫుట్‌పాత్‌లపైనో, అందమైన మార్కెట్లలోనో, షాపుల్లోనో తిరుగు. ఈ ప్రదేశాలను కూడ అప్పుడే ఇతరులు ఆక్రమించి వుంటారు.

అయితే మురికివాడల్లోకో, కాటేజీల్లోకో, బోదగుడిసెల్లోకో, రేకుషెడ్లల్లోకో వెళ్ళు. ధాబాలకో, మురికికాల్వ పక్కన దుర్గంధ పూరితమై, చెమ్మగా నున్న గదిలో ఒకసీటు రిజర్వుచేసుకో అక్కడ కూడ నోవేకన్సీ లేబుల్‌వుందా- మనసుంటే మార్గముంటుంది.

ఎన్నో రైల్వేబ్రిడ్జిలున్నాయి. అక్కడ ఆశ్రయంపొందు. వెలుగునీడలు దాగుడుమూతలాడేసమయానికి వైట్‌కాలర్ పెద్దమనుషులు, బానపొట్టలున్నవాళ్ళు, బాగాముసుగు కప్పుకున్నవాళ్ళు, రిక్షాల్లోనూ, టాక్సీల్లోనూ, కార్లలోనో, ఇంపోర్టెడ్ కార్లలోనూ చీకటిపడగానే నీదగ్గరకొస్తారు. మళ్ళీ తెల్లవారకమునుపే వెళ్ళిపోతారు.

కానీ నువ్విక్కడేవుండిపోవద్దు. ఇది కాంతివంతమైన నగరం. ఇది మసకబారిన చీకటికి ఆశ్రయదాత. నన్నుగురించి బాధపడవద్దు. రాత్రి చీకటి సర్వస్వం మింగేసిన తర్వాత, నన్నెవరూ గుర్తించలేని సమయంలో నేను నిన్ను ఎక్కడున్నావో పసిగడతాను. నల్లని ముసుగేసుకుని, మసాకబారిన చీకటి సహాయంతో నేను నిన్ను చేరుకుంటాను. అయితే ఒక షరతు! నువ్వు నన్ను చీకట్లో ఒంటరిగా వున్నప్పుడు కలుసుకోవాలి. అప్పుడే తెల్లవారిందిపుడు. వెలుతురు చాల క్రూరమైంది. ఉరిమానుకంటె క్రూరమైంది. రాజశాసనాన్ని అమలుపరచే కత్తికంటె పదునైనది. ●